

# పసిడిమనసులు - షర్మిల



# ఆడతోడు

"**ఓం నారాయణాయ** నమహ ... ఓం మాధవాయ నమహ ...ఒరేయ్ నీ జిమ్మదియ్య ఎక్కడ సచ్చావురా ! ఓం అనంతాయ నమహ ... మీ దీపాలార ఎక్కడికెళ్తే అక్కడే సస్తారేంట్రా" ... ఇదీ మా సామ్మామ్మ పూజ. అసలు సామ్మామ్మ తిట్లతోనే మా వూళ్లో తెల్లారుతుంది .

సామ్మామ్మ అసలు పేరు సరస్వతమ్మ నేను పసితనంలో నోరు తిరగక సామ్మామ్మ అనేదాన్నంట. .

సామ్మామ్మ మా తాతకి అక్క. ఆవిడ పదకొండేళ్లకే అక్క చచ్చిపోతే అక్కమొగుడికే ఇచ్చి పెళ్లి చేశారంట. పసితనంలోనే పెళ్లి కావడంతో పుట్టిన బిడ్డ పురిట్లోనే పోయాడట. ఈమె కడుపుతో వున్నప్పుడే భర్త కూడా పోవడంతో పుట్టిల్లు చేరింది.

సామ్మామ్మ పచ్చటి రంగు, నొక్కులజుట్టుతో ఎత్తుగా వుండేది. వయసులో మిలమిల మెరిసిపోయేదట.

ఆమె ఎప్పుడూ ఆరుగజాల తెల్లటి పంచెలే కట్టుకునేది. జాకెట్టు వేసుకోకుండా పంచె నిండుగా కప్పుకునేది. ఎప్పుడైనా పూజలప్పుడు కాశీ నుంచి తెచ్చుకున్న లేత పసుపురంగు చీర కట్టుకుని నుదుటి మీద పొడవుగా తిరునామం పెట్టుకుంటే నాకెంతో సంబరంగా వుండేది. "సామ్మామ్మా నువ్వు ఎప్పుడూ రంగు రంగు చీరలు కట్టుకో వచ్చుగా" అని మారాం చేసేదాన్ని .

సామ్మామ్మ అంటే వూళ్లో వాళ్లందరికీ హడల్.. మా ఇంటికి కరేపాకు కోసం వెళ్లమన్నా "అమ్మో సరస్వతమ్మగారు వూరుకోరు" అని ఆమె నోటికి భయపడేవారు.

నాకు ఒక్కదానికే సామ్మమ్మ అంటే భయం లేదు. సామ్మామ్మకి నేనంటే బోలెడు ఇష్టం. తాతకి ఆడపిల్లలు లేరు. మేనల్లుడికి కూతురినని తన తరవాత ఇంటి ఆడపిల్లనని "నువ్వే నా ఆడతోడువే తల్లీ! " అనేది .

పొద్దున్నే తళతళలాడే ఇత్తడి పళ్లెంలో మందారాలు. నందివర్ధనాలూ, ఇంకా రకరకాల పూలు కోసేది. తులసి కోట దగ్గర రెండుగంటలూ దేముడి దగ్గర గంట పూజచేసేది. అది ఆవిడకి కాలక్షేపం. పూజ అయ్యాక ప్రసాదాల పంపిణీ. అందరికీ మామూలు బెల్లం నాకు మాత్రం పటిక బెల్లం పెట్టేది.

నాయనమ్మకీ, సామ్మామ్మకీ అప్పుడప్పుడూ హోరాహోరీ యుద్ధాలు జరిగేవి. చివరికి అలిసిపోయి వూరుకునేవారు ఎంతపోట్టాడుకున్నా భోజనాల వేళకి పెద్దపళ్లె లో వేడి వేడి అన్నం కూరా , పచ్చడి , చిక్కటి మజ్జిగతో ఆడపడుచ కి భోజనం పెట్టేది మా చిట్టెమ్మ .

నిద్రలేచి కాఫీ తాగి వూరి మీద పెత్తనాలకి బయల్దేరేది. ఎక్కడో ఒకదగ్గర కబుర్లు చెబుతూ వాళ్లని " అమ్మాయ్ కాస్త కాపీ ఇవ్వవే " అని అడిగేది.

గూఢచారిలా ఆవిడ వెనకే వెళ్లి "మన ఇంట్లో ఇప్పుడే కదా తాగావ్ ! వీళ్లని కాఫీ అడిగావని చిట్టెమ్మకి చెప్తాను వుండు" అని బెదిరించేదాన్ని .

" పోన్లే అమ్మడూ మామ్మ కాఫీయేగా అడిగింది ... మా ఆస్తి తరిగిపోతుందా ఏం?" అనేవారు.

భీకరంగా పూజలు చేసే మా సామ్మమ్మ ఆదివారం మా వూళ్లో క్రిష్టియన్లు ప్రార్థనలు చేసే ఇంటికి ఠంచనుగా హాజరయ్యేది. ఎందుకంటే వాళ్లు ఫలహారాలు పెట్టే వారు. ఆవిడతో పాటు నన్నూ వెంటేసుకుని వెళ్లేది . ఒక్కోసారి సంచి సర్దుకుని చుట్టాలిళ్లకి ప్రయాణం కట్టేది.

" అమ్మడూ బొబ్బర్లంక వెళ్తన్నా.. నువ్వూ రావే " అనేది.

నేను రానని చెప్పేసేదాన్ని . నాకు తెలుసు ఇట్లాంటి ముసలాళ్లతో చుట్టాలిళ్లకి వెళ్తే సరిగ్గా మర్యాదలు జరగవని.

సామ్మామ్మ మా పెద్ద ఇంట్లో ఒక పక్కగా వున్న గదిలో వుండేది. ఆమె వూరెళ్లినప్పుడు ఆ గదితాళం వేసి వుండేది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుండేది. మా తాత " మా అప్ప ఇంకా వూరి నుంచి దిగలా ఏంటో?!" అనుకునే వాళ్లు . కానీ ఇంట్లో వున్నప్పుడు వాళ్లు మాట్టాడుకునే వారు కాదు. ఎప్పుడైనా పోట్టాడుకునే వారంతే .

సామ్మమ్మ శనివారం రాత్రి గోధుమపిండి, పంచదార కలిపి తీపి అట్లు వేసుకుని తినేది. వాటిలో నా ఒక్కదానికే వాటా వుండేది . సామ్మామ్మతో ఎప్పుడైనా మా వూరి పక్కనే వున్న కూచిపూడి వెళ్తే ఆ వూళ్లోకి వెళ్లడమే మా సామ్మామ్మ అచ్చంగా బ్రాహ్మల్లా మాట్లాడడం మొదలెట్టేది .

ఒక రోజు ఇద్దరం నడిచి వస్తూ నేను అడిగాను "సామ్మామ్మ మీ ఆయన ఏమయ్యాడు?" అని.

"రుద్రారం వెళ్లాడు ఇక రాడు " అని చెప్పింది . రుద్రారం ఎక్కడ అడిగితే పైకి చూపించింది. చిన్నప్పుడు అర్థమయ్యేది కాదు కానీ తరవాత రుద్రభూమి అని అర్థమైంది .

ఒక రోజు నేను బళ్లో చదువుకుంటుండగా మా సామ్మామ్మ వచ్చింది. పాఠం చెప్పే మాస్టారు ఎవరు అని అడుగుతుండగానే లోపలికి వచ్చింది .

"అమ్మడూ నీకు బఠాణీలు కొన్నాను స్కూలు ఇక్కడేగా అని ఇవ్వడానికి వచ్చా తీసుకో" అంటా సంచి తీసింది. పిల్లలంతా నవ్వుతున్నారు. నాకు అవమానం ముంచుకొచ్చింది .

కోపంగా " నువ్వు ఇక్కడికి ఎందుకొచ్చావ్? వెళ్లిపో! " అన్నాను. ఈలోగా నా పక్కనున్న పిల్ల "ఈవిడ మీ నాయనమ్మా?" అని అడిగింది. "ఛీ ! ఏం కాదు మా నాయనమ్మ చక్కగా రంగు చీరలు కట్టుకుని, నగలు పెట్టుకుంటుంది.ఈవిడ మా నాయనమ్మేం కాదు " అనేశాను. సామ్మామ్మ దెబ్బతిన్న పక్షిలా నా వంక చూసింది .

ఆడతోడు అని ఆమె నా మీద పెంచుకున్న మమకారాన్ని నేను తుంచేశాను. గతం ఒక్కసారి తిరిగొస్తే నేను చెరిపేయాలనుకునే క్షణాలు ఇవేనని నాకెప్పటికీ అనిపిస్తుంది!!

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments